క్లుప్తంగా

గంగానమ్మ జాతర



గంగానమ్మ తల్లికి ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

భీమడోలు : గుండుగొలనులో ఆదివారం గంగానమ్మ జాతర అంగరంగ వైభవంగా జరిగింది. ప్రత్యేకంగా ముస్తాబు చేసిన ఎడ్లబండిపై అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. బాణసంచా, మేళతాళాల నడుమ అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. శక్తి వేషాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. భక్తులు అమ్మవారి పాదాల చెంత పసుపు నీళ్లు పోశారు. అమ్మవారికి చీరలు, జాకెట్లు కానుకలు సమర్పించారు. అనంతరం అమ్మవారి ఆలయంలో మొక్కుబడులు చెల్లించారు. గ్రామంలోని పూల వీధి, కుండీల పేట, తాత చెర్వు గట్టుకు చెందిన యాదవులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దాళ్వా పంట చేతికందే దశలో రైతులను కాపాడాలని, గ్రామం సుభిక్షంగా ఉంచాలని కోరుతూ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏటా ఈ జాతరను జరుపుకుంటారు.

నాగాశ్వని అమ్మవారికి విశేష పూజలు



అమ్మవారికి బంగారు, వెండి ఆభరణాలు అలంకరిస్తున్న దృశ్యం

దెందులూరు :గాలాయగూడెంలోని శ్రీఅచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఆలయ ఆవరణలో ఉన్న శ్రీ నాగాశ్వని అమ్మవారికి ఆలయ చైర్మన్ పూజారి అన్నవరం ఆదివారం రూ. 2లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు బహూకరించారు. ఆదివారం అమ్మవారికి ఈ ఆభరణాలు అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రోడ్డు పనులు ప్రారంభం



ఆలయానికి వెళ్లే రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం

దెందులూరు: గాలాయగూడెంలోని శ్రీ అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఆలయానికి వెళ్లే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. దాత మణికంఠ కన్‌స్ట్రక్షన్స్ అధినేత గంటా కోటేశ్వరరావు, అచ్చమ్మ దంపతులు ఈ రోడ్డు అభివృద్ధికి రూ. 25 లక్షలను ఆలయ కమిటీకి అందజేశారు. దీంతో పనులు ప్రారంభించారు. పూర్తి స్థాయి నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు నిర్మిస్తామని ఆలయ కమిటీ తెలిపింది.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత



విద్యార్థులతో ఆర్డీవో కిషోర్, జేడీ మధుసూదనరావు

భీమడోలు : పదో తరగతి పరీక్షల్లో ఎటువంటి ఆందోళన చెందకుండా విద్యార్థులు పరీక్షలు రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఏలూరు జిల్లా ఆర్డీవో పెంచల కిషోర్ సూచించారు. గుండుగొలను, భీమడోలు, పూళ్ల గ్రామాల్లోని సాంఘిక సంక్షేమ బాలికలు, బాలుర వసతి గృహాల్లోని టెన్త్ చదువుతున్న 66 మంది బాలబాలికలకు ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు, జామెంట్రీ బాక్సులను సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్.మధుసూదనరావుతో కలిసి ఆయన ఆదివారం అందించారు. వారందరితో గ్రూప్ ఫొటో దిగి విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూవో మంగతయారు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి



పవన్‌కుమార్‌ను అభినందిస్తున్న అబ్బయ్యచౌదరి


దెందులూరు : వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు గూడపాటి పవన్ కుమార్ ఆదివారం ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే ఆయనకు సూచించారు. అనంతరం పవన్‌కుమార్ మాట్లాడుతూ ఐటీ విభాగం రాష్ట్ర అధ్యక్షుని ఆదేశాల మేరకు జిల్లాలో అన్ని మండలాలు, అన్ని గ్రామాల్లో ఐటీ విభాగం నూతన కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని, శిక్షణా కార్యక్రమాలు ఉంటాయని ఎమ్మెల్యేకు వివరించారు.

విద్యార్థులూ.. విజయోస్తు..

- నేటినుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం
- నియోజకవర్గంలో 2,721 మంది పరీక్ష రాసేందుకు ఏర్పాట్లు
- 19 కేంద్రాల్లో 186 మంది ఇన్విజిలేటర్ల నియామకం
- కేంద్రాల వద్ద 144 సెక్షన్‌తోపాటు నో సెల్‌ఫోన్ జోన్‌లు
- రెండు సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు



పెదనిండ్రకొలను పరీక్షా కేంద్రంలో సీరియల్ నంబర్స్‌పై ప్లాస్టర్స్ వేస్తున్న సిబ్బంది



భీమడోలులో హాల్ టికెట్ల నంబర్లు కేటాయిస్తున్న అధికారులు

మండలం	కేంద్రాలు	విద్యార్థులు	ఇన్విజిలేటర్లు
గణపవరం	6	789	52
ఉంగుటూరు	5	750	50
నిడమర్రు	3	359	33
భీమడోలు	5	823	51
మొత్తం	19	2721	186

నిడమర్రు: నియోజకవర్గంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం నుంచి ఈనెల 18 వ తేదీ వరకూ నిర్వహించే టెన్త్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా విద్యాశాఖ ముందస్తుగా తగిన చర్యలు తీసుకుంది. ఆదివారం సిబ్బందికి రాష్ట్ర విద్యాశాఖా అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తగిన సూచనలు జారీ చేశారు. అలాగే ఇన్విజిలేటర్లుకు ప్రత్యేక శిక్షణ తరగతులు పూర్తి చేశారు. ఉంగుటూరు నియోజకవర్గంలో ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్ 45 ఉండగా ఆయా స్కూల్స్‌లో టెన్త్ పరీక్షలకు 2336 మంది పరీక్షలు రాసేందుకు 19 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. 38 మంది ఛీఫ్, డీవోలతోపాటు 175 మంది ఇన్విజిలేర్లను నియమించారు. నియోజకవర్గంలో పిప్పర, కైకరం పరీక్షా కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా అధికారులు గుర్తించి ఆయా కేంద్రాల వద్ద సీసీ కెమేరాలు ఏర్పాటు చేశారు. గతంకు భిన్నంగా పక్కా ప్రణాళికగా పారదర్శకంగా పరీక్షలు నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఎక్కడైనా అవకతవకలకు పాల్పడినా, కాపియింగ్‌కు ప్రోత్సహించినా ఆయా సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇప్పటికే విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ హెచ్చరించారు. దీంతో ప్రభుత్వ ప్రతిష్టకు ఎటువంటి అవరోధం జరగకుండా రాష్ట్రస్థాయి నుంచి పరీక్షా కేద్రం స్థాయి వరకూ అన్ని రకాల నిఘా ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల నిజమైన ప్రతిభకు ఈ పరీక్షలు నిదర్శనం కానున్నాయి. దీంతో పరీక్షకు హాజరయ్యే విద్యార్థులూ.. విజయోస్తూ.

నో ఫోన్ జోన్‌లుగా పరీక్షా కేంద్రాలు

పరీక్షా కేంద్రాల చుట్టుపక్కల ప్రాంతాల్లో 144 సెక్షన్ అమల్లో ఉండటంతోపాటు, నో ఫోన్ జోన్‌లుగా కేంద్రాలు ఉంటాయి. ఇప్పటికే విద్యాశాఖ పరీక్ష కేంద్రాల్లోని సెల్‌ఫోన్‌ను తీసుకెళ్లడాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. చీఫ్ అబ్జర్వర్లు, డిపార్మెంట్ అధికారులు, ఇన్విజిలేటర్లు సైతం పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను తీసుకెళ్లకూడదని స్పష్టం చేశారు. ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహించనుండగా.. విద్యార్థులను కేంద్రాల్లోకి ఉదయం 8.45 నుంచి 9.30 గంటల వరకు అనుమతిస్తామని అధికారులు ప్రకటించారు. అలాగే విద్యార్థులు జవాబులు రాసేందుకు 24 పేజీల బుక్‌లెట్ అందించనున్నారు. ఇది నిండిన తర్వాత అడిగే మరో 12 పేజీల బుక్‌లెట్‌ను అందిస్తారు. అలాగే సైన్స్ పరీక్షకు 12 పేజీల బుక్‌లెట్లు 2 ఇస్తారు. ఫిజికల్ సైన్స్ సబ్జెక్టుకు ఒకటి, బయోలజీకి మరో బుక్‌లెట్ ఇవ్వనున్నారు.

ఒక్క నిమిషం అలస్యమైనా నో ఎంట్రీ

భీమడోలు : పదో తరగతి పరీక్షలకు భీమడోలు మండలంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. విద్యార్థి ఒక్క నిమిషం అలస్యంగా వచ్చినా పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు తమ హాల్ టిక్కెట్లు చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేసే అవకాశం ప్రభుత్వం కల్పించింది. మండలంలోని భీమడోలు, గుండుగొలను, ఆగడాలలంక, పోలసానిపల్లి, పూళ్ల పరీక్షా కేంద్రాల్లో 1220 మంది టెన్త్ పరీక్షలు రాయనున్నారు. 51 మంది ఇన్విజిలేటర్లును నియమించింది. ఈ పరీక్షా కేంద్రాల్లో భీమడోలు మండలానికి చెందిన 823 మంది పరీక్షలు రాస్తారు. మిగిలిన 397 మంది విద్యార్థులు ఏలూరు, ద్వారకాతిరుమల మండలాలకు చెందిన పాఠశాలల విద్యార్థులు రాయనున్నారు.

ఉంగుటూరు మండలంలో...

ఉంగుటూరు : మండలంలో 13 హైస్కూళ్లకు సంబంధించి 750 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. 300 మంది తెలుగు మీడియం, 450 మంది ఇంగ్లీషు మీడియం విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. తెలుగు మీడియంలో 157 మంది బాలికలు, 143 మంది బాలురు, ఇంగ్లీషు మీడియంలో 227 మంది బాలికలు, 223 మంది బాలురు పరీక్షలు రాయనున్నారు. మండల విద్యాశాఖాధికారి లక్ష్మీనారాయణ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం నాడు పాఠశాలలకు వచ్చి పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. పోలీసులు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.

డ్యూటీ నుంచి ఎవ్వరికీ మినహాయింపు లేదు



పదో తరగతి పరీక్షలలో ఇన్విజిలేటర్ డ్యూటీ నుంచి ఎవ్వరికీ ఎటువంటి మినహాయింపులేదు. డ్యూటీ పడిన అందరూ తప్పనిసరిగా ఆయా కేంద్రాల వద్ద ఉదయం 8.30 గంటల లోపు ఉండాలి. డ్యూటీ లేని రోజుల్లో తప్పనిసరిగా పాఠశాలకు హాజరవ్వాలి. 3, 6, 10, 13, 15 తేదీల్లో మాత్రమే ఇన్విజిటేర్లను ఆన్ డ్యూటీగా పరిగణిస్తాం. సబ్జెక్ట్ టీచర్స్‌ను ఆయా సబ్జెక్ట్ పరీక్షల్లో ఇన్విజిలేషన్ నుంచి రిలీవ్ చేస్తారు.

– పుచ్చుల శేషు, ఎంఈవో, నిడమర్రు

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన ఉత్పత్తులు



భోగాపురంలో ప్రకృతి వ్యవసాయంపై మాట్లాడుతున్న ఏలూరు సేవక్ తిరుపతయ్య

పెదవేగి : ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన వ్యవసాయ ఉత్పత్తులను సాధించవచ్చని గ్రామసేవక్ సమితి ఏలూరు సేవక్ తిరుపతయ్య పేర్కొన్నారు. పెదవేగి మండలం భోగాపురంలో ప్రకృతి వ్యవసాయంపై ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న తిరుపతయ్య మాట్లాడుతూ మన పూర్వీకుల నుంచి ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని, మధ్యలో బ్రిటీష్ వారి పరిపాలనలో ఆధునిక వ్యవసాయాన్ని మనకు అంటగట్టారన్నారు. ఈ వ్యవసాయం వల్ల ఉత్పత్తులు పెరిగినా అవి మనకు మంచి ఆరోగ్యాన్ని ఇవ్వడంలేదన్నారు. ఈ విషయాలను గమనించి అందరూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కోరారు. ఏసీపీ సరోజిని మాట్లాడుతూ రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగిస్తూ జీవామృతం తయారీ నుంచి వాటి వినియోగం వరకు రైతులకు వివరిస్తున్నట్లు తెలిపారు. నడిపల్లి రామరాజు ఆధ్వర్యంలో జీవామృతం తయారీ విధానాన్ని వివరించారు. సత్తిబాబు, వీర్ల తిరుపతిరావు, మురళి పాల్గొన్నారు.

బంగారు గొలుసు సమర్పణ

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్నకు సికింద్రాబాద్‌కు చెందిన సోలేటి ఫణీంద్రరావు సుమారు రూ.4.05 లక్షలు విలువైన 74.500 గ్రాముల బరువుగల బంగారు గొలుసును ఆదివారం సమర్పించారు. దాత స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈ బంగారు గొలుసును ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావుకు అందజేయగా, ఆయన దాతకు సంబంధిత రసీదును అందించారు.

పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేదవాడికి అందుతున్నాయని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. ఏలూరు మండలం మాదేపల్లి పంచాయతీ గురుకులపేటలో ఆదివారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ, వర్గ భేదాలు లేకుండా పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సమన్వయంతో పని చేసి అర్హులను గుర్తించి పథకాలను అందించాలన్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు స్థానిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందిస్తూ వాటిని పరిష్కరించాలని మండల పరిషత్, పంచాయతీ అధికారులను ఆదేశించారు. పార్టీ స్థానిక నాయకుడు గుర్రం సుబ్బారావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు, ఈఓపీఆర్డీ ఎం.సరళకుమారి, ఏపీఓ కిషోర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నిరంతర సాధనతోనే నైపుణ్యం



మేపోల్ డ్రిల్ శిక్షణలో విద్యార్థులు

దెందులూరు : వ్యాయామ విద్యలో నిరంతర సాధన, క్రమశిక్షణ పాటిస్తేనే నైపుణ్యం సాధించి భవిష్యత్తులో వృత్తిపరమైన శిక్షణకు దోహదపడుతుందని గోపన్నపాలెం వ్యాయామ విద్యాకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నత్తానియేల్ అన్నారు. ఆదివారం వ్యాయామ కళాశాలలో యూజీడీ, బీపీఈడీ విద్యార్థులకు యాక్టివిటీస్‌లో కళాశాల లెక్చరర్ల ద్వారా శిక్షణ నిర్వహించారు. మేపోల్ డ్రిల్, లేజిమ్, హూప్స్, శారీ డ్రిల్, ఏరోబిక్, కోలాటం, డంబుల్స్ విభాగాల్లో శిక్షణ ఇచ్చారు.

ఆసరాతో మహిళల ఆర్థికాభివృద్ధి



పిప్పరలో మహిళలకు ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం : మహిళల ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఆదివారం గణపవరం మండలం పిప్పరలో డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా (డ్వాక్రా రుణమాఫీ) మూడో విడత పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. మహిళలు ఈ పథకాన్ని సక్రమంగా వినియోగించుకుని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. డ్వాక్రారుణాలన్నీ మాఫీ చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక మాఫీ మాట మర్చిపోయిన చంద్రబాబుకు మహిళలు సరైన గుణపాఠం చెప్పారని అన్నారు. ఎన్నికల ముందు డ్వాక్రా మహిళలకు పదేసివేల రూపాలయలను బ్యాంకు ఖాతాలలో జమచేసినా మహిళలు చంద్రబాబును నమ్మకుండా ఇంటికి సాగనంపి తమ విజ్ఞతను చాటారని అభినందించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలలో మహిళల ఓట్లకోసం చంద్రబాబు మళ్లీ మోసపూరిత వాగ్దానాలు మూటకట్టుకుని బయలుదేరుతున్నారని, మహిళలు అప్రమత్తంగా ఉండి తమకు ఎంతో ప్రాధాన్యత ఇస్తూ ప్రోత్సహిస్తున్న వైఎస్ జగన్‌కు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మహిళలకు వైఎస్సార్ ఆసరా రుణమాఫీ చెక్కులు అందచేశారు. 559 స్వయం సహాయక సంఘాలకు రూ.4,64,77,385 చెక్కులను అందచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సూర్యబలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ దేవారపు సోమలక్ష్మి, మండల ఉపాధ్యక్షురాలు నీతిపూడి వీరమ్మ, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము, పిప్పర సర్పంచ్ కాకర బేబీ, జిల్లా వైఎస్సార్ సీపీ కార్యదర్శి దండు సూరిబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు, ఎంపీడీవో జ్యోతిర్మయి, పార్టీ నాయకులు కాకరశ్యాం పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

నిడమర్రు: పెదనిండ్రకొలను గ్రామంలో వేంచేసియున్న శ్రీ వేణుగోపాల స్వామి వారి పాంచాహ్నిక దివ్య కళ్యాణ మహోత్సవాలు ఆదివారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు 5 రోజులు పాటు జరగనున్నాయి. తొలిరోజు ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొని స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను పూర్ణకుంభంతో ఆహ్వానించిన కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ కోడే కాశి, పార్టీ అధ్యక్షులు కోడూరి రాంబాబు, దేవస్థానం చైర్మన్ కోడే అంజనేయులు, సొసైటీ డైరెక్టర్ పేపకాయిల కాశీ వరప్రసాద్, ఆర్బీకే చైర్మన్ పుప్పాల కొండయ్య, మాజీ సొసైటీ అధ్యక్షులు చినిమిల్లి బుల్లియ్య, మండల బీసీ సెల్ అధ్యక్షులు కొడవర్తి కృష్ణ, నక్కా పైడియ్య, చినిమిల్లి బుల్లియ్య తదితరులున్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం



వైష్ణవికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు : ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం అని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మండలంలోని గోపన్నపాలెం, గాలాయగూడెంలోని బాధితులకు ఆదివారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఇటీవల మృతి చెందిన గోపన్నపాలెం గ్రామానికి చెందిన వీరంకి మృత్యుంజయరావు కుటుంబానికి రూ.1 లక్ష చెక్కును, గాలాయగూడెంలో అనారోగ్యంతో బాధపడుతున్న పసుపులేటి నాగలక్ష్మికి రూ.2.85 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు కామిరెడ్డి నాని, పార్టీ గ్రామ అధ్యక్షులు వీరంకి సత్యనారాయణ, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, సర్పంచ్‌లు కోటే నాగమల్లేశ్వరి, చిలకా వెంకటసుబ్బారావు, కుమార్, పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

బాధిత కుటుంబాలను ఆదివారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పరామర్శించారు. న్యాయంపల్లి గ్రామానికి చెందిన దేవరపల్లి రవి కుమారుడు గగన్‌తేజ (3) ఇటీవల ప్రమాదవశాత్తు ఇంటి వద్ద ఉన్న మరుగుదొడ్డి కోసం తవ్విన నూతిలో పడి మృతి చెందాడు. రవి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం ఆర్థిక సాయాన్ని అందించారు. అలాగే అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సింగవరపు ప్రసాద్ ఇటీవల గుండెపోటుతో మరణించగా, అతని కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ఆర్థిక సాయాన్ని అందజేశారు. రాట్నాలకుంట గ్రామానికి చెందిన అవిర్ని వైష్ణవికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ 3,28000 చెక్కును ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఏపీ ఆయిల్ ఫెడ్ మాజీ రైతు కమిటీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు అందించారు. అలాగే వేగివాడ గ్రామానికి చెందిన మేని కృష్ణమూర్తికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ 55 వేల చెక్కును ఇంటికి వెళ్లి అందజేశారు. గ్రామంలోని శ్రీరాట్నాలమ్మ తల్లిని ఆదివారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానానికి విచ్చేసిన ఎమ్మెల్యేని కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో సత్కరించారు.

ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి

భీమడోలు : భీమడోలులోని అతిపురాతన దేవాలయం శ్రీపార్వతీ సమేత భీమేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి దాతలు, గ్రామస్తులు ముందుకు రావాలని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు. ఆదివారం ఆదివారం శివాలయం వద్ద అభివృద్ధి కమిటీ ఏర్పాటైంది. ఆలయం ప్రహరీ, ఫ్లోర్ అధ్వానంగా ఉండడంతో భక్తులు పండుగల సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ నేపథ్యంలో ఆలయ అభివృద్ధికి ప్రభుత్వ సహకారంతో పాటు పెద్దలు, దాతలు సహకరించాలని సభ్యులు డాక్టర్ బాలు, వైఎస్సార్ సీపీ నేత చింతా శ్రీరామచంద్రమూర్తి కోరారు. సభ్యులు చింతా సత్తిబాబు, పున్నం గోపి, వంకాయల వెంకటేశ్వరరావు, పిచ్చెట్టి రామకృష్ణ, పెండ్యాల వెంకట్రావు, కరణం వాసు, బండారు సత్తియ్య పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



దోసపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న సాల్వేషన్ ఆర్మీ సంఘస్తులు



భీమడోలు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు



పెదవేగిలో ఈత మట్టలతో ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వాసులు, చిన్నారులు

భీమడోలు : క్రైస్తవులు మ్రానికొమ్మల ఆదివారాన్ని భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఏసుక్రీస్తు పునరుత్థానం(ఈస్టర్) దినానికి ముందు వచ్చే ఆదివారంను మ్రానికొమ్మల ఆదివారం(మట్టల ఆదివారం)గా జరుపుకుంటారు. కొబ్బరి, ఈత మట్టలను చేత పట్టుకుని క్రైస్తవ గీతాలాపన చేస్తూ గ్రామ పురవీధుల్లో ప్రదర్శన చేశారు. మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల, ఎంఎంపురం, పోలసానిపల్లి, సూరప్పగూడెం, లంక గ్రామాల్లో ఆర్‌సీఎం, సీఎస్‌ఐ, సీబీసీఎన్‌సీ, రక్షణసైన్యం తదితర క్రైస్తవ ఆలయాల్లోని విశ్వాసులు 40 రోజుల ఉపవాస దీక్షలు చేపట్టారు. భీమడోలు ఆర్‌సీఎం విచారణ పరిధిలో విచారణకర్త ఫాదర్ నెల్సన్ ఆధ్వర్యంలో క్రైస్తవ విశ్వాసులు ఈత మట్టాలతో ఊరేగింపు నిర్వహించారు. తొలుత డీపాల్ స్కూలు నుంచి ఏసు శిలువతో పాటు భక్తులు కొబ్బరి మట్టలను చేతపట్టుకుని పురవీధుల్లో భారీ ప్రదర్శన చేశారు. అనంతరం ఆర్‌సీఎం చర్చి వద్ద దివ్య పూజాబలిని నిర్వహించారు. ఫాదర్ నెల్సన్ విశ్వాసులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో ఫాదర్లు జోబి, రాజు, విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పెదలింగంపాడులోని ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారాన్ని ఘనంగా జరుపుకున్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ పాల్గొన్నారు.

గణపవరం : క్రీస్తు బోధనలు ఆచరిస్తే మనిషిలో శాంతి, సహనం పెరుగుతాయని, తద్వారా సమాజంలో శాంతియుతజీవనం సాధ్యమని పలువురు అన్నారు. మట్టల ఆదివారం సందర్భంగా క్రైస్తవులు మట్టలు చేతబట్టి గ్రామంలో క్రీస్తు గీతాలు ఆలపిస్తూ ప్రదర్శన జరిపారు. అనంతరం బాప్టిస్టు చర్చిలో జరిగిన ప్రార్థనలో పాల్గొన్నారు. బాప్టిస్టు సంఘాల ఫీల్డ్ కౌన్సిల్ అధ్యక్షుడు డేవిడ్ లివింగ్‌స్టన్, క్రైస్తవ వారాంత కళాశాల ప్రిన్సిపల్ ఐజాక్ నిర్మల్‌కుమార్ దేవుని సందేశాన్ని వినిపించారు. సంఘకాపరులు ఏలీషా, పి.రత్నబాబు పాల్గొన్నారు.

దెందులూరు : గ్రామగ్రామాన మట్టల పండుగ జరిగింది. సాల్వేషన్ ఆర్మీ, సీఎస్ఐ, మన్నా సంఘాలతో పాటు స్వతంత్ర సంఘాల్లో ఫాదర్లు, పాస్టర్లు, సంఘస్తులు, సంఘ పెద్దలు, గ్రామస్తులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆదివారం ఉదయం గ్రామాగ్రామాన ఈతకొమ్మలకు వివిధ రకాల పువ్వులు గుచ్చి కొమ్మలు చేత పట్టుకుని గీతాలాపాన నడుమ ప్రధాన వీధుల మీదుగా ర్యాలీగా చర్చిలకు వెళ్లారు.

పెదవేగి : మండలంలో మట్టల ఆదివారం పండుగను విశ్వాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కొబ్బరి, ఈత ఆకులకు పూలు గుచ్చి, క్రీస్తు రాజుకు జై, యూదుల రాజుకు జై, దావీదు రాజు జై అంటూ పురవీధుల్లో విశ్వాసులు భారీ ర్యాలీ నిర్వహించారు. అన్ని విచారణ పరిధిలోని గ్రామాల విశ్వాసులు, సంఘస్తులు, దీక్షాపరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.